మహిళా జ్యోతి

# పువ్వు - తుమ్మెద

ఎస్. హన్మంత్రావ్

ఉదయం—ఎనిమిదీ పది....

అప్పుడే తెరిచారు లైబ్రరీ.

అంతా నిశ్శబ్దం, పైన ఫ్యాన్ల చప్పుడు తప్ప!

సైన్సు రాక్ దగ్గర నిలబడి బుక్స్ వెతుకుతున్నాడు శశి.... ఒక్కడే!....

జోళ్ల చప్పుడు, సుతారంగా—

చటుక్కున తలతిప్పి గుమ్మం కేసి చూశాడు ఆతృతగా.

ఇద్దరు ముద్దుగుమ్మలు—ఉష....మంగ.

బుక్స్ మార్చుకోవడానికి కాబోలు—వొచ్చారు.

శశి కళ్లు అమావశ్య నక్షత్రాల్లా మెరిశాయి మిలమిలా....కొన్నిక్షణాలు.

చిన్నగా ఈల వేశాడు పైకి శబ్దం రాకుండా. చిటికెలు వేశాడు. ....''ఓహ్! .... గోల్డెన్ డాల్స్!—'' హుషారుగా అనుకున్నాడు.

వాళ్లు వస్తూనే, చూడనట్టు చూశారతన్ని....

పుస్తకాల్ని లైబ్రేరియన్ చేత 'రవుండఫ్' చేయించుకుని 'టికెట్' తీసుకున్నారు.

మంగ అవతలి వరుసలో మూలగా వున్న 'పొయిట్రీ' రాక్ దగ్గరి కెళ్లింది.

నవలల రేక్ కేసి ఉష.

నావల్స్ రాక్కూ, సైన్స్ రాక్కూ సైడ్ బై సైడ్.

....'అన్నీ చదివినవే!....'

విసుగ్గా పక్కకు తల తిప్పింది ఉష.

శశి, చేతిలోని పుస్తకం పేజీలు తిరగేస్తూ ఆ వంకతో, ఆమెనే చూస్తున్నాడు.

అతని కళ్లల్లో— పెదాలపై....కొంటె నవ్వు.

ఉలికిపాటు ఫీలై కలవరంగా తల తిప్పేసింది వుష.

మనసు 'ఏదోలా' అయ్యిందామెకు.

గోరింటాకు పెట్టుకున్న ఆమె ఎర్రటి వేళ్లు మాత్రం నవలల్ని వెతుకుతూనే వున్నాయి.

....'ఇంకా అలానే చూస్తోన్నాడా? .... లేదా?....' మనసులో తర్జన భర్జన...

ఐనా, ఉష అతనివైపు తల తిప్ప దల్చుకో లేదు—తిప్పలేదు కూడా....

ఉష చేతిలోకి 'లత'—'ఒమర్ ఖయాం'

వొచ్చింది. అంతే!....దాన్ని పట్టుకుని వేగంగా లైబ్రేరియన్ సీట్ వైపు నడిచింది.

నడుస్తూ తనకు తెలీకుండానే ఒకసారి అతని కేసి చూసేసింది.

బుక్ 'రాయించు' కున్నాక, ఆయన్ని ఏదో పాత మంత్లీ అడిగి తీసుకుని వరండాలో కెళ్లి కూచుంది.

....'అతను బయట కింకా రాడేం?....' ('ఛీ!....ఇదేం(విటి? .... అతని గొడవ తన కెందుకు?—')....'పాపం! ....కావాల్సిన బుక్ ఇంకా దొరకలేదు కాబోలు!....'

వేళ్లు పేజీల్ని తిరగేస్తున్నాయి.... కళ్లు అక్షరాల్ని చూస్తోన్నాయి—కాని మనసు మాత్రం పుస్తకం మీదలేదు. మరి?....

లోన, శశి సైన్సు రాక్ నించి కదిలాడు.

....'ఏది రెండో బేబి?....' అటూ ఇటూ చూశాడు. లైబ్రేరియన్ దగ్గర కొచ్చి, అక్కడున్న తొట్టి లోని బుక్స్‌ని పరిశీలిస్తున్నట్లు నటిస్తూ— చూశాడు.

ఇంకా మంగ కవిత్వపు రాక్ దగ్గరే వుంది. బయటికి తీసిన బుక్స్‌ని, రెండేసి పేజీలు చూసి మళ్లీ పెట్టేస్తున్నది.

....'లిటరరీ టచ్ బాగా వున్నట్టుందే!....' మెత్తగా అడుగు లేస్తూ అనువాద నవలల రాక్ కేసి నడిచాడు.

ఆ రాక్ పొయిట్రీ రాక్ సరసనే వుంది.

నవలల్ని వొరసగా తీస్తోన్నాడు.

....'స్పార్టకస్' .... 'పారిస్ పతనం'.... 'దిటవు గుండెలు'....

తీస్తోన్నాడేగాని, వాటిని చూడటం లేదసలు. ఆ వంకతో చూస్తున్నాడు ఆమెను....

మంగ గ్రహించింది, ఆ సంగతి.

ఆమె చేతిలోంచి పుస్తకం జారి పడింది.

వంగితీస్తో, చూసింది అతని కేసి.

....' ఎవరీ బాలకుడు?....' సరదాగా అనుకుంది.

అతను అలానే దొంగ చూపులు....

ఆ చూపులకు, మంగకి నవ్వొచ్చింది. కింది పెదవిని పంటితో సుతారంగా నొక్కి ఆపేసింది నవ్వుని.


# "సాంప్రదాయ సిద్ధమయిన భారతీయ ఔషధాలకి ప్రత్యేకమయిన శక్తివుంది. ఉదాహరణకి, అమృతాంజన్."




ప్రకృతిలో లభించే అత్యంత శక్తివంతమయిన పది మూల ఔషధాలతో అమృతాంజన్ తయారు చేయబడుతోంది. అంటే అమృతాంజన్ చాలా శక్తివంతమయినది.

అందుచేత అమృతాంజన్ తలనొప్పులకు, జలుబులకు, వంటినొప్పులకు, బెణుకులకు శీఘ్రంగానూ, నిశ్చయంగానూ ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు అమృతాంజన్ సురక్షిత మయిన బాధా నివారిణి.

అమృతాంజన్ : 80 సంవత్సరాలకు పైబడిన నమ్మకమైన దివ్య ఔషధము

**అమృతాంజన్ తలనొప్పులకు. జలుబులకు. వంటినొప్పులకు. బెణుకులకు**



AM-2148

పుస్తకాలు తీస్తోంది.

చెలం — "సుధ" .... నారాయణబాబు— "రుధిరజ్యోతి"....'అర్థం కావేమో'—పెట్టేసింది వాటిని.

ఇంకా తన్ని చూస్తూనే వున్నాడనిపించింది ఆమెకు.

ఆ ఆలోచనకి చిరుకోపం మొలకెత్తింది ఆమెలో.

చివ్వున తలతిప్పి చూసిందతన్ని.

కోపంగానే చూశా ననుకుంది.

కోపాల్లో రకాలున్నాయి. కొన్ని కోపాలు అసలు కోపాలే కాదు. ఎండా వెలుగే....మరి వెన్నెలా వెలుగే!....కాని రెంటికీ తేడా లేదూ?

ఆమె కళ్ళలో అసలు తీక్షణత లేదు.

లేత నీలం కళ్ళద్దాల్లోంచి నవ్వుతున్నాయి అతని కళ్ళు..ఏదో ప్రాధేయపడుతున్నట్లున్నాయి అతని చూపులు....కొద్దిసేపు 'అలా' చూసి—పుస్తకం లోకి తల తిప్పుకుంది.

ఆమె చేతిలో దాశరథి....'గాలిబ్ గీతాలు'.

పేజీలు సుతారంగా తిప్పుతూ ఒకచోట ఆగి చదివింది.

....'భాను సోమాదులకు తీసిపోని నాదు
నేత్రములు నీ పదాల నంట నీయవేమొ?....'

—చురుక్కుమంది ఆమెకు.

ఆ పుస్తకం తీసికొని అతని పక్కనించి పేజీలు తిరగేస్తూ విసవిస నడచింది లైబ్రేరియన్ వైపు.

బుక్ రిజిష్టర్‌లో సంతకం చేసి తలెత్తుతూ చూసిందతన్ని.

అతనింకా ఏదో ముఖ్యమైన పుస్తకం దొరకనట్టు సీరియస్‌గా వెతుకుతూనే వున్నాడు.

'ఆహా!....నటనాగ్రేశ్వరుడు!....'

విచ్చుకుంటున్న పూరేకుల సుతారపుసొగసు-చిర్నవ్వు తాకిడికి కదిలిన ఆమె పెదాల్లో.

వరండాలో కొచ్చింది. మంత్లీ తిరగేస్తూ వుష కనిపించింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

"పోదామాండీ?"....పుస్తకం మూసి లేచింది ఉష. మనసు మాత్రం....'ఇంకావుందాం'....అంటో గోల చేస్తోంది. "కాలేజీకి టైం అవుతుంది."—సర్దిచెప్పింది మనసుకి.

"ఆఁ"

('కొంసేపు వుందాం'....అందాం అనుకుంది మనసులో మంగ.)

ఉష మంత్లీ యిచ్చేయడానికి లోని కొచ్చింది.

ఇచ్చేస్తూ చూసిందతన్ని.

అతనూ ఇటే చూస్తున్నాడు.

తలొంచుకుని బయటి కొచ్చేసింది.

ఇద్దరూ కదిలారు.

శశి ఏ పుస్తకమూ తీసుకోకుండానే, వొచ్చేశాడు బయటికి.

రంగు రంగుల అర్థ సర్కిల్ డిజైన్లున్న చీరె, జాకెట్లలో—నిటారుగా నడుస్తోన్న ఇంద్రధనుస్సులా—మంగ....

ఆమె మేనివన్నెకు మ్యాచ్ అయిన పండు మొగలిరేకు రంగు డ్రెస్‌లో, వెన్నెల దాల్చిన రూపంలా—వుష....వెడుతున్నారు.

మంగ కురుల్లోంచి వస్తోన్న సింహాచలం సంపెంగల పరిమళాన్ని, వుష జడలోంచి వస్తోన్న బొగడపూల సుగంధాన్ని జమిలిగా ఆస్వాదిస్తూ శశి—వాళ్ల వెనుకనే....

రోడ్డుమీద....

....'వస్తున్నాడా అతను?....' కనురెప్పలు సుతారంగా కదుపుతూ క్రీగంట చూసింది ఉష.

....'ఫాలో అవుతున్నట్లున్నాడు!'....కళ్లు దీర్ఘం చేసి వాలుచూపులు చూసింది మంగ.

'వస్తున్నాడు.'—ఆనందం. తృప్తి.

'ఫాలో అవుతునాడు.' — సంతోషం. గర్వం.

'బావున్నాడు కదూ!....' అనుకుంది ఉష (ఛీ!.... ఏఁవిటీ వూహాలు?....)

'మాన్లీగా వున్నాడు'—మంగ. ('యూ బ్రూట్ అతనెలా ఏడుస్తే నీ కెందుకు?....' మనసుని కసురుకుంది.)

విసవిస నడుస్తున్నారు, ఎర్రటి పాదాలపై కుచ్చిళ్లు పొరాడుతుంటే.

....వాళ్ల వేగానికి తగ్గట్టుగా అడుగులేస్తూ శశి.

....'బావున్నారు .... "పాపలు" .... (శశి పర్సనల్ డిక్షనరీలో ఆ పదానికి ప్రత్యేకార్థం వుంది.) ఎపుడూ కనిపించలేదు.... ఇక్కెక్కడో? ఇద్దరికీ దూరంగా వుంటే బాగుణ్ను. ఇద్దరూ ఫ్రెండ్స్ కాకుంటే బాగుణ్ను—భలే వున్నారు యిద్దరూ.....

ముందు వాళ్లు వెనుక శశి—నడుస్తూనే వున్నారు.

—'తన గురించే!....'—అనుకుంది వృష

....'హీ ఫాలోస్ మీ!'—మంగ

కాని....

అతను మాత్రం....

*   *   *

శశి వో చిన్నసైజు కాసనోవా.

అందాల్ని అనుభవించటం, ఆనందించడం తప్ప మగాడికి ఏ బరువూ బాధ్యతా దేవుడు నిర్దేశించలేదని అతని ఫిలాసఫీ.

అంచాత సాధ్యమైనన్ని అందాల్ని అనుభవించటం, సాధ్యమైనంత ఆనందాన్ని జుర్రుకోవటం అతని లైఫ్ ప్రిన్‌సిపల్.

శశి తన లైఫ్ ప్రిన్స్‌పల్‌ని ప్రాక్టికల్‌లో పెట్టడానికి—అతని అందం .... ఆకర్షణ .... డబ్బూ—సాధనాలు.

*   *   *

అదేవిటో....అంతా శశి ఆశించినట్లే అయ్యింది.

అతను కోరుకునట్టుగానే వాళ్లిద్దరూ ప్రాణస్నేహితులూ కారు, ఎక్కడికైనా జంటగా తప్ప విడిగా వెళ్లని సాన్నిహిత్యం వున్నవాళ్లూ కారు. కనీసం క్లాస్‌మేట్స్ కాదు. కేవలం స్కూల్ మేట్స్‌మాత్రం.

ఆవేళ—వూరికి ఆ చివర్న, ఈ చివర్న.... వున్నవాళ్ల యిళ్ల నించి ఒంటరిగానే బయల్దేరారు లైబ్రరీకి. దార్లో కలిశారు కాకతాళీయంగా. ముఖపరిచయం కొద్దీ పలకరించుకుని, కల్సి వొచ్చారు— అంతే!

....ఈవిషయాలన్నీ కొద్దిపాటి 'పరిశీలన'తోటే అర్థమయ్యాయి, ఎక్స్‌పర్ట్ శశికి.

ఇంకేం—యుగాల పురుషత్వం అతన్ని వుత్సాహపర్చింది.

అంతే—[illegible]

దిగటమేకాదు, త్వరలోనే వాళ్లనీ దించాడు....

శశి, వాళ్లిద్దరితోనూ 'సైమల్‌టేనియస్'గా సాగిస్తోన్న "ప్రేమ" (క్షమించాలి—ఇది తెలుగుకథ.)....చెకచెకా చిర్నవులూ....పలకరింపులూ....ప్రేమ లేఖలు రాసుకోవడాలు.... "ఒకరి కొకరు" అనుకోవడాలు—లాంటి దశలన్నిటినీ ఝూమ్మని దాటేసి 'చివరిదశ' కొచ్చేసింది.

అవును—మగాడి వంచనా చాతుర్యం ముందు ఆఫ్ట్రాల్!....ఆడదెంత?....

—ఇక తర్వాతి కథ గురించి వివరంగా చెప్పనక్కర్లేదు. అదేం కొత్త కథ కాదు. యుగాల నించీ జరుగుతున్నదే, అది అందరికీ తెలుసున్నదే.

అది....ఏంలేదు .... పువ్వుల్నించి తేనెని తృప్తితీరా పీల్చేసుకున్న తుమ్మెద మరోసారి ఎగిరిపోయింది.

తేనె కోల్పోయి వాడిపోయిన వో పువ్వు ఎక్కడో రాలిపోయి వెంటనే మట్టిలో కల్సిపోయింది.

మరో పువ్వు నలుగురూ నడిచే దార్లో రాలిపడి, ఎన్నో కరకు కాళ్ల కింద నలిగి నలిగి రేకలు వూడగొట్టుకుని—చివరికి ఆ మట్టిలోనే కల్సింది.

అయితే—తుమ్మెద మాత్రం యింకా కొత్త పూలను వేటాడుతూనేవుంది....

ఈ కథకి ఇప్పట్లో ముగింపులేదు. కాని ముగిసే రోజు ఒకటి వుంది....

మగాడి వంచనని తెల్సుకోలేని అమాయకతలో, తప్పించుకోలేని అశక్తతలో—ఆ వంచనకి నాశనమయ్యే హీనస్థితిలో ఆడది లేని రోజున....

తనకి సంఘం, ధనం, అధికారం ప్రకృతి యిస్తోన్న ఆధిక్యతా బలిమితో—స్త్రీ తనకి ఆనందాన్నిచ్చే వో వస్తువు అనుకునే స్తితిలో మగవాడు లేని రోజున....

ఈ కథకు అంతం!....

అందాకా—

ఆడది పువ్వు.

మగాడు తుమ్మెద.

అంతే.